# పెద్ద దిక్కును కోల్పోయాం

డి. జర్మియ*

**మా**నవ హక్కుల నిర్విరామ పోరాట యోధుడు బాలగోపాల్‌గారి గురించి నాకు తెలిసిన నాలుగైదు మాటలు అందరితోనూ పంచుకోవాలని ఉంది. 'ప్రార్థనలు ప్రభువుకు, ప్రసాదం పాలెగాళ్ళకు' అనే నివేదికను మీరంతా చదివే ఉంటారు. కర్నూలు జిల్లా ఆదోని ప్రాంతంలో తెలుగు బాప్టిస్ట్ క్రైస్తవ ఆస్తులు దురాక్రమణకు గురైన సందర్భంలో బాలగోపాల్‌గారి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం వెలువరించిన నివేదిక అది. దళితుల మీద, మైనారిటీల మీద ఏ రకమైన దాడులు దురాక్రమణలు జరిగినా స్పందించేటువంటి నాయకుడు ఇక లేరన్న వార్తను నేనిప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నాను.

బాలగోపాల్‌గారు నాకు ఒక్కోసారి దూతగా, ఒక్కోసారి గొప్ప పోరాటయోధుడిగా దర్శనమిస్తారు. హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు బాధితుల పక్షాన ఒక రాయబారిగా అధికారులతో చర్చించి తక్షణ ఉపశమన చర్యలను అమలు చేయించడానికి ఎంత ప్రాధాన్యతనిస్తారో, అంతే నిక్కచ్చిగా వారి నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తారు.

ప్రతిఫలాపేక్ష లేకుండా ఎంతమంది పేద ప్రజల కేసులను ఆయన న్యాయస్థానాల్లో వాదించారో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. తిమ్మిని బమ్మి, బమ్మిని తిమ్మి చేసి అబద్ధాలమీద నాలుగంతస్థులు లేపుకుందామనే న్యాయవాదులు వర్ధిల్లుతున్న రోజుల్లో బాలగోపాల్‌గారు నిజంగా అరుదైన వ్యక్తి. న్యాయవాద వృత్తిలో ప్రవేశించేటప్పుడు న్యాయానికి న్యాయం చేస్తానని ప్రమాణం చేస్తారట న్యాయవాదులు.

* **మానవహక్కుల వేదిక కర్నూలు జిల్లా అధ్యక్షుడు**

ఆ ప్రమాణానికి కట్టుబడి బతికిన న్యాయవాది బాలగోపాల్ గారు. ఏ కేసు వాదించినా ఆయన బాధితుని పట్ల ప్రేమతోనూ, బాధ్యతతోనూ చేశారు.

బాలగోపాల్ గారికి తెలియని విషయమంటూ ఏమీలేదనిపిస్తుంది. పండితునికీ, పామరునికీ కూడా విషయం అర్థం చేయించగల శక్తి సామర్థ్యాలేవో ఆయనలో దాగి ఉన్నాయి. వారి అబ్బాయికి జీర్ణ వ్యవస్థ గురించి పాఠం చెప్పినా, దళితుల, ఆదివాసుల హక్కుల గురించి సంస్థ సమావేశాల్లో అనర్గళంగా ప్రసంగించినా, అణు పరిహార బిల్లు గురించి మాట్లాడినా... ఆయన విషయంపై ఎంత కేంద్రీకరణతో ఉంటారో స్వయంగా మనమంతా ఎరుగుదుం.

ఆయన ఎంతటి సాదాసీదా జీవితాన్ని ఎంచుకున్నారో ఆయన వస్త్రాలూ, చెప్పులూ, స్కూటరూ, బస్సులపై ప్రయాణాలూ మనకు సూచిస్తాయి. విలాసవంతమైన జీవితానికి ఆయన దూరంగా బతికారు. ఎక్కడికి వెళితే అక్కడి ఆహారాన్ని, అది ఉగ్గాని బజ్జీ అయినా కూడా తిన్నారు తప్పితే ఎవరినీ ఇబ్బంది పెట్టేవారు కారు.

ఒక సాహసి, ఒక నిస్వార్థ జీవి, ఒక హక్కుల పోరాట యోధుడు, ఒక సాదాసీదా మనిషి, ఒక ప్రజా న్యాయవాది, ఒక బోధకుడు, ఒక తేజోమూర్తి మనల్ని వదలి వెళ్ళిపోయాడు. మనకి మనమే దిక్కయ్యాం. ఆ వెలితి మనల్ని వెంటాడుతున్నా ఆయన చూపిన మార్గంలో కలిసి అడుగేద్దాం.